# బూర్గుల శ్రీనాథ శర్మ

నీటి బిందువుల్లో నీ రూపం! పిచ్చిగా చెరిపేసాను.

నిశ్శబ్దం, నిర్వీర్యం, నిశీధం, నిర్వేదన, నీరసం— నిజంగా నా జీవితం ఎండిపోయిన మోడుగా మారిపోతున్నదా? వసంతంలేని ఎడారిలా మారనున్నదా? పూల వనంలోంచి విసిరేసినట్లు! నా జీవితం నన్నే శాసిస్తోంది.

ఎందుకిలా వేస్తున్నావు? ఏమిటి నీవు సాధించబోయేది? ఎందుకు నీకీ ఒంటరితనం? ఎందుకు నీకీ విచిత్రమైన శిక్ష? ఏమాశించి నీవీ ఒంటరిబాటని పయనిస్తున్నావు? ఆ దారి అంతం ఉందా? నీ జీవితంలో గమ్యాన్ని చేరుకోగలవా? ఎన్ని వసంతాలు ఇలా పయనిస్తూనే వుంటావు!

ఈ ప్రశ్నలకి సమాధానాలు— సాధించాలి. అదే నా సమాధానం. దానికి ఉత్తేజం నీ వూపిరి! నా బ్రతుకు బాటలో వెనక్కి తిరిగి చూస్తే— ''వెళ్ళు! గుండె ధైర్యంతో నీ గమ్యాన్ని చేరుకో!'' అని అంటున్న నీ రూపము కనబడుతుంది. ముందుకి చూస్తే ''రా! నన్ను అందుకో!'' అని నీవు ఆహ్వానిస్తున్నట్లు అగుపిస్తుంది.

నా చుట్టూ ఉన్న ప్రపంచంలో నీ రూపం కోటానుకోట్లు, పుంఖాను పుంఖాలుగా కనిపించి నాలో ఆత్మస్థైర్యాన్ని నింపుతుంది. అప్పుడు అనిపిస్తుంది నిజంగా నేను ఒంటరివాణ్ణా అని. నా ప్రేయసి నాతోనే వుంది. ఆమె నాకు తోడూ, నీడా! ఆసరా ఇచ్చి పైకిలేపి, నాలో ఊపిరిని పోసే ఊహా ఊర్వశి నా వెంటే ఉంది!

ఒక్కోసారి నా ఊహలు ఎలా ఉంటాయో తెలుసా? నా గమ్యాన్ని చేరడంలో నిన్ను కోల్పోతానేమోననే భావన కలుగుతుంది. ఆకాశంలోంచి అమాంతం భూమిమీదికి జారిపడుతున్న అనుభూతి కలుగుతుంది. నిన్ను కోల్పోతే? నేను ఇంత కష్టపడి లాభమేమిటి? నీ కోసమే నేనీ బాటను ఎంచుకున్నాను. ఆత్మీయులను, అనుబంధాలను తెంచుకొని ఎందుకిలా పరుగెడుతున్నాను? నీ కోసమే! నీ కోసమే! నీవు లేని నా గమ్యం శూన్యమే! నీవు లేని జీవితం జీర్ణ దేవాలయమే!

అందరినీ వదిలి దూరంగా వెళ్ళిపోవడం నా పిరికితనమా? వాళ్ళంటే భయమా? కాదు. కానేకాదు.

మనం మనిషిగా పుట్టడం ఒకే ఒక్కసారి. ఈ జన్మలోనే ఏదైనా సాధించగలం. బ్రతకడానికి తిండి, తిండికోసం బ్రతుకు— అనే పద్ధతి నాకు నచ్చదు. జీవితం బ్రతకడానికి, తినడానికే కాదు— ఏదో ఒకటి సాధించాలి. ఒక లక్ష్యం కోసం, ఒక ఆదర్శం కోసం, ఒక ఆశయం కోసం జీవించాలి. దాన్ని సాధించడంకోసం ఈ జీవిత కాలం సరిపోయినా ఫరవాలేదు.

అయ్యో! అందరికీ దూరమయ్యామే అన్న బాధ పడనవసరం లేదు. అందుకే నేను ఒంటరిగా నా గమ్యాన్ని చేరుకోవాలని నిశ్చయించుకున్నాను.

నా గమ్యానికి ప్రేరణ నీవు! నాకు నీ సహాయం కావాలి. నీ సహకారం కావాలి. నీ ఓర్పుకావాలి. నీ ధైర్యం కావాలి. నీ దీవెన కావాలి. నీ ఉత్తేజం కావాలి. నీ ఉత్సాహం కావాలి. నీ ఊపిరి కావాలి. నీ నవ్వు కావాలి. నీ ప్రేమ కూడా కావాలి!

నన్ను స్వార్థపరుడనుకుంటున్నావా? ''నీవు ఆనందంగా జీవించు. నీ ఆనందాన్ని ఇతరులకు పంచు'' ఇది నా సిద్ధాంతం.

ప్రియతమా!

నేనడిగిన వాటిని అందించగలవా? నా జీవన చరిత్ర పుస్తకంలో నీవూ ఒక పుటలో అలంకరించగలవా! నా జీవితాన్ని నీవూ పంచుకోగలవా?

'యుద్ధరంగంలో విజయాన్ని వరించు!' అని వీరతిలకం దిద్ది భర్తను సాగనంపే వీర నారీత్వం నీలో ఉందా?

ఇవి పిచ్చి ప్రశ్నలు కదూ? కాదు! కొంచెం ఆలోచించు... ఇంకొంచెం ఆలోచించు... బాగా ఆలోచించు... లోతుగా ఆలోచించు... జీవితానికి అన్వయించు.

నీ గుండెలో రక్తం ఉవ్వెత్తున లేచిందా? అయితే నీలో గుండె ధైర్యం ఉంది. నన్ను ఉత్తేజింప జేయగలవు.

ఇదేదో కథ కాదు. ఈ జీవితం నీకూ, నాకు మధ్య. మనం చేయి, చేయి కలిపితే సాధించలేనిది లేదు. విజయం మనదే!

"ఈ ఉత్తరానికి జవాబు— అసలు ఇది ఉత్తరమేనా? కాదు. జీవిత సమస్య. ఈ సమస్యకి పరిష్కారం నీ నుండి ఏనాడు అందుతుందో?

కోరికలు కేవలం శారీరకమే కాదు మానసికం కూడా!



## ఈర్ష్యాభావం

మినీకథ

ఆనంద్, శ్రీనివాసరావు అనే ఇద్దరు అన్నదమ్ములున్నారు.

అన్నయ్య ఆనంద్‌కు మంచి పేరు వస్తుంటుంది. అది చూడలేక తమ్ముడు అన్నయ్యకు ఇంత మంచి ఎలా వస్తుంది అని ఆలోచనలో పడ్డాడు. ఆ తరువాత ఒకరోజు ఆనంద్ ఊరిలో ఎవరో చనిపోతే పలకరించుటకు వెళ్తున్నాడు.

అది చూసి శ్రీనివాసరావు అన్నయ్య వెనకాలే వెళ్ళాడు. ఆనంద్ చనిపోయిన వారిని కలిసి, పలకరిస్తూ, ''ఊరుకో సుబ్బారావు... బాధపడకు. మీ అమ్మగారు నీకే అమ్మ కాదు. నాకు అమ్మలాంటిదే... మనద్దరికే కాదు. మన వూరందరికీ అమ్మలాంటిదే. బాధపడకు'' అని వినయంగా అన్నాడు అది చూసిన శ్రీనివాసరావు మా అన్నయ్యకు ఇలాంటి పలకరింపుల వలనే ఇంత మంచి పేరు వచ్చేస్తుంది.

ఇకనుంచి నేను కూడా ఇలాంటి పలకరింపులవలన మంచిపేరు తెచ్చుకుంటాను అని ఊర్లో ఎవరు చచ్చిపోతారని ఎదురుచూస్తున్నాడు. ఒకరోజు అకస్మాత్తుగా సుబ్బారావు గారి భార్య చనిపోయింది. ఆ విషయం శ్రీనివాస్‌కు తెలిసింది. ఆనంద్‌కంటే ముందే వెళ్ళి పలకరిస్తూ— ''ఊరుకో సుబ్బారావు— ఆవిడ నీకే భార్య కాదు, నాకు భార్యలాంటిది'' అని అనేసరికి సుబ్బారావు కాలి చెప్పుతీసి పడా...పడా... బట్టలు చిరిగి పోయేట్లుగా కొట్టి పంపించారు.

— వురిని. నారాయణమూర్తి